క్లుప్తంగా

అభివృద్ధి పనులు ముమ్మరం



వనపర్తి టౌన్: మున్సిపాలిటీలోని 15వ వార్డులో టీయూఎఫ్ఐడీసీ కింద రూ. 2కోట్ల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు తుదిశకు చేరుకున్నాయి. ఈ మేరకు సోమవారం 15వ వార్డులోని పాత యూకో బ్యాంక్ వద్ద ర్యాంపు పనులను మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్ బండారు కృష్ణ పర్యవేక్షించారు. రూ.2 కోట్ల నిధులతో వార్డుల్లో ఐదు మార్గాల్లో పూర్తిగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామని, కౌన్సిల్ పాలన ముగియడంతో తన అభ్యర్థన మేరకు అధికారులు ముమ్మరంగా పనులు చేపడుతున్నారని తెలిపారు. మూడు రోజుల క్రితం టీయూఎఫ్ఐడీసీ కింద ఎమ్మెల్యే మేఘారెడ్డి రూ. 50లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారని, వాటిని త్వరలోనే పూర్తి చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. వార్డు అభివృద్ధికి రూ. 50లక్షలు కేటాయించిన ఎమ్మెల్యే మేఘారెడ్డికి బండారు కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేష్‌యాదవ్ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై జిల్లా అధికారుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మండల విద్యాశాఖ తరఫున ఎంఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మ, సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శేఖర్‌నాయక్, కంప్యూటర్ ఆపరేటర్ మూర్తి, ఐఈఆర్పీ సంతోష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అమరచింత డాక్టర్‌కు బెస్ట్ రీసెర్చ్ అవార్డు



అమరచింత: పట్టణానికి చెందిన డాక్టర్ మంత్రి రమేష్ నిమ్స్ డైరెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ రిసెర్చ్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో కొన్నేళ్లుగా వైద్యుడిగా సేవలు అందిస్తున్న ఆయన ఇమ్యూనిటీ వ్యవస్థపై ప్రత్యేకంగా పరిశోధనలు చేయడంతో బెస్ట్ రిసెర్చ్ అవార్డుకు ఎంపికయ్యారు. పట్టణానికి చెందిన డాక్టర్ రమేష్‌కు అవార్డు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణానికి చెందిన రోగులు నిమ్స్‌లో చేరారనే సమాచారం తెలిసిస్తే వెంటనే వారి వద్దకు వెళ్లి మెరుగైన వైద్యం అందేలా చూస్తున్న డాక్టర్ రమేష్‌కు మరిన్ని అవార్డులు రావాలని ఆకాంక్షిస్తున్నారు.

'వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి'



వనపర్తి రూరల్: గోపాల్‌పేట మండలంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థి భరత్ మృతికి కారణమైన వారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, టీఆర్ఎస్వీ, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్, మహిళా సంఘం ఐద్వా, ఏఐటీయూసీ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్ ఆస్పత్రి ఎదుట మృతి చెందిన విద్యార్థి బంధువులు చేస్తున్న ధర్నాలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థి మృతికి కారణమైన వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తూ.. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గోపాలకృష్ణ, రమేష్, గణేష్, పవన్, ఆది, చంద్రశేఖర్, భగత్, మహేష్, కవిత, రేణుక, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

కొత్తకోట రూరల్: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా కొత్తకోటలోని జెఎస్ రాములు ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఎస్పీ రావుల గిరిధర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. మద్యం తాగి, అధిక వేగంతో వాహనాలు నడపరాదని, వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన ఆర్సీ, ఇన్సురెన్స్ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే, మైనర్లకు వాహనాలు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే నష్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. దీంతోపాటు సైబర్ నేరగాళ్లతో యువత అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత నంబర్ల నుంచి ఫోన్ కాల్స్ వస్తే స్పందించకూడదని, వెంటనే సమీప పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకులు, జాతీయ రహదారిపై గల హోటళ్లు, వివిధ దుకాణ సముదాయాల వద్ద ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ఆవరణలో ఈ పోస్టర్ల ద్వారా విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పిస్తామని స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వనపర్తి ట్రాఫిక్ ఎస్ఐ సురేందర్, జేఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు జె.సతీష్‌రాజు, మహిమరాజు, రమేష్ తదితరులు ఉన్నారు.

'సీపీఎస్'ను రద్దు చేయాలని వినతి



అమరచింతలో ఆర్ఐకి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు



కొత్తకోటలో..

కొత్తకోట: కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ ఉపాధ్యాయులు సోమవారం తహసీల్దార్ వెంకట్‌రాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ను చేర్చకుండా ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని కోరారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి చేరవేయాలని తహసీల్దార్‌ను ఆయన కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ మండల ప్రధాన కార్యదర్శి భీంపల్లి బాలరాజు, జిల్లా సాంస్కృతిక కార్యదర్శి రాజారెడ్డి, సీనియర్ ఉపాధ్యాయుడు శ్రీశైలం తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: సీసీఎస్ విధానం రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానం కొనసాగించాలని కోరతూ పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కాశీం, మండల అధ్యక్షుడు వెంకటస్వామి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానం కొనసాగించాలని కోరుతూ సోమవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఆర్ఐ గోపాల్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సద్దల శ్రీనివాసులు, మండల నాయకులు హనుమంతు, దోమ శ్రీనివాసులు, నాగరాజు, సందీప్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు అహంకారం వీడాలి



మాట్లాడుతున్న భరత్‌భూషణ్

కొత్తకోట: పట్టణ కాంగ్రెస్ నాయకులు అధికారం లేనప్పుడు, అప్పటి అధికార బీఆర్ఎస్ అడుగులకు మడుగులొత్తి, అధికారం వచ్చిన తర్వాత అహంకారాన్ని ప్రదర్శిస్తూ.. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటేనని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ సీనియర్ నాయకుడు, తాజా మాజీ కౌన్సిలర్ భరత్ భూషణ్ మండిపడ్డారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం లోపాయికారిగా మద్దతు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులుగా అమాయకులను నిలబెట్టి వారిని ఓడించి, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేశారని ఆరోపించారు. కౌన్సిల్ ఏర్పడ్డప్పటి నుంచి బీఆర్ఎస్ అవలంబించిన తప్పుడు విధానాలపై ఇంటా, బయట బీజేపీ అలుపెరుగని పోరాటం చేసిందన్నారు. రోడ్డు విస్తరణ, మున్సిపల్ కార్యాలయం కూల్చివేత, ప్రభుత్వ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే విషయంలో అలుపెరుగని పోరాటం చేసింది బీజేపీ మాత్రమే అని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకుల్లారా ఐదేళ్ల నుంచి బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఏదైనా ఆందోళన కార్యక్రమం చేపట్టారా? ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు నారాయణమ్మ, నవీన్‌రెడ్డి, బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



దంతనూరులో ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

మదనాపురం: మండలంలోని దంతనూరు గ్రామానికి చెందిన నాగరాజు ఇటీవలే మృతి చెందాడు. అతడి చిన్ననాటి స్నేహితులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారు పోగు చేసిన రూ.31,500 వేల ఆర్థికసాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు వెంకటస్వామి ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక నాయకులతో విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, రాష్ట్ర నాయకులు మెంటెపల్లి పురుషోత్తంరెడ్డి, అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, అనుజ్ఞారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గౌని వేమారెడ్డి, రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్దిరాజు, వివిధ మండలాల అధ్యక్షులు, స్థానిక నాయకులతో కలిసి సోమవారం గ్రామంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అదించారు. వారి వెంట బీజేపీ మండల అధ్యక్షుడు సందా వెంకటేష్, విష్ణు, క్రాంతి, నాగరాజుయాదవ్, బుచ్చిబాబు, నాయకులు భగవంతుయాదవ్, కదిరె మధు తదితరులు పాల్గొన్నారు.

వీసీల నియామకంపై కేంద్ర ప్రభుత్వ జోక్యం తగదు

కొల్లాపూర్: యూనివర్సిటీల్లో వీసీల నియామకంపై కేంద్రం పెత్తనం తగదని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు డి.శేఖర్ అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తీరు కేంద్రానికి మద్దతుగా ఉన్నట్లు కనబడుతోందని ఆరోపించారు. యూనివర్సిటీలపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటే ప్రాంతీయ విద్యార్థులకు అన్ని రకాలుగా నష్టం చేకూరుతుందని తెలిపారు. సమావేశంలో జయరాం, మాసూమ్‌బాబా, మహ్మద్ సోహైల్, శివ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బీరప్ప బండారు ఉత్సవం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



సీఐ శివకుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూర్: కురుమ, యాదవుల ఆరాధ్యదైవమైన బీరప్ప బండారు ఉత్సవాలు ఆత్మకూర్ పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మక్తల్ శాసనసభ్యుడు డాక్టర్ వాకిటి శ్రీహరి, రాష్ట్ర మార్కెటింగ్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒకరిపై మరొకరు పసుపు చల్లుకుని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్ యాదవ్, కురుమలు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

జిల్లా ఉత్తమ సీఐగా అవార్డు దక్కించుకున్న ఆత్మకూర్ సీఐ శివకుమార్‌ను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేందర్, పోలీసు సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఖిల్లాఘనపురం: రేషన్ బియ్యం సేకరించి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం ఖిల్లాఘనపురం మండలంలోని సోళీపురం గ్రామానికి చెందిన ఎన్.నారాయణరెడ్డి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో సివిల్ సప్లయి ఉప తహసీల్దార్ దుబ్బాక పరమేష్ ఈ నెల 25న గ్రామానికి వచ్చి పరిశీలించారు. ఎన్.నారాయణరెడ్డి రేషన్ బియ్యాన్ని కిలో రూ.10కి కొనుగోలు చేసి 4 క్వింటాళ్ల బియ్యాన్ని ఇంట్లో 8 ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ చేసుకోవడంతో పంచనామా నిర్వహించి బియ్యాన్ని సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన బియ్యాన్ని ఖిల్లాఘనపురం చంద్రకళ రేషన్ డీలర్ వద్ద భద్రపరిచారు. సోమవారం సంబంధిత అధికారి వచ్చి బియ్యాన్ని పరిశీలించి అవి రేషన్ బియ్యం అని నిర్ధారించారు. బియ్యాన్ని కొనుగోలు చేయడం, అమ్మడం చట్టవిరుద్ధమని నారాయణరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దుబ్బాక పరమేష్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నాగరాజు తెలిపారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు



సువర్ణ (ఫైల్)

వీపనగండ్ల: మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన ఆకులమోని సువర్ణ మూడు రోజుల క్రితం కనిపించకుండా పోవడంతో భర్త కుందేళ్ల రమేష్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాణి తెలిపారు. ఈ నెల 24 తేదీన అనారోగ్య సమస్యతో బాధపడుతూ చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్తున్నానని పెంట్లవెల్లికి వెళ్లి అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారని ఆమె తెలిపారు. సువర్ణ ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

పీఎఫ్ సమస్య పరిష్కరించాలి

అమరచింత: బీడీ కార్మికులు కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న పీఎఫ్ సమస్యను ఫ్యాక్టరీ యజమానులు ముందుండి పరిష్కరించాలని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో సోమవారం ఉమ్మడి జిల్లా ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్న కార్మికులకు పీఎఫ్ సౌకర్యం కల్పించకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని తెలిపారు. పీఎఫ్ ఖాతాలకు సంబంధించి చిన్నచిన్న తప్పులను సరిచేయాలని కోరారు. గుర్తింపు కార్డు ఉన్న ప్రతి బీడీ కార్మికుడికి పీఎఫ్‌తో సంబంధం లేకుండా జీవన భృతి ద్వారా పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. బీడీ తయారీ కూలి రేట్లను పెంచాలని.. వేతనాల్లో కోతలను నివారించాలన్నారు. బీడీ కార్మికుల పీఎఫ్ సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జీఎస్ దేవదానం, సామేలు, అరుణ్‌కుమార్, రాజు, కొండన్న, వెంకటన్న, వెంకటేష్‌గౌడ్, చంద్రన్న ఉన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని ఆకుతోట ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరి ఆలయంలో స్వామివారికి అర్చకుడు లోకేశ్వరయ్య పూజలు నిర్వహించి గుడికి తాళాలు వేశారు. ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఆలయంలోకి గుర్తుతెలియని వ్యక్తులు గుడి తాళాలు విరగ్గొట్టి ఆలయంలోకి వెళ్లారు. హుండీలో నగదుతో పాటు స్వామివారి వెండి ఆభరణాలు, భక్తులు సమర్పించిన కళ్లు, మీసాలను ఎత్తుకెళ్లారు. ఉదయం అర్చకుడు ఆలయానికి రాగా అప్పటికే గుడి తెరచిఉండటంతో దొంగతనం అయ్యిందని భావించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు.

శ్రీకృష్ణ ఆలయ ఆహ్వాన కరపత్రిక విడుదల



ఆహ్వాన కరపత్రిక విడుదల చేసిన యాదవ సంఘం సభ్యులు

కొత్తకోట: పట్టణ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయంలో ఫిబ్రవరి 13న నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కరపత్రికను సోమవారం ఆలయంలో యాదవ సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఫిబ్రవరి 13న గణపతి పూజ, నవగ్రహ పూజ, ప్రధాన దేవత ఆవాహనం, విగ్రహాలకు అభిషేకం, మంగళ హారతి, 14న పుణ్యాహవాచనం, ఆలయ వాస్తు, అగ్ని ప్రతిష్ఠ, ప్రధాన దేవత హోమాలు, నూతన విగ్రహాలకు కర్మాజ్ఞస్నపన తిరుమాంజనం, మంగళ హారతి, 15న ప్రాతఃకాల పూజలు, ప్రతిష్ఠాపన ఉత్సవం, యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన, గో కన్యాది దర్శనం, మహా పూర్ణాహుతి, కలశ విద్యాసన, తీర్థ ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పూజలకు కొత్తకోట పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో విశ్వేశ్వర్, గుంత మౌనిక, వామన్‌గౌడ్, చెన్నకేశవరెడ్డి, సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, తిమ్మన్న, పెంటన్న యాదవ్, రాములు యాదవ్, అంజియాదవ్, సత్యంయాదవ్, గాడీల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

మండలంలోని కానాయపల్లి శివారులో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణుడి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన జరగనున్న నేపథ్యంలో పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ చీర్ల మంజుల ఎల్లస్వామి రూ.25,116 విరాళం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తిమ్మన్న యాదవ్, సత్యంయాదవ్, శంకర్ యాదవ్, పెంటన్న యాదవ్, బాలకొండన్న తదితరులు పాల్గొన్నారు.

'కొత్తకోటకు బీఆర్ఎస్ గ్రహణం వీడింది'



మాట్లాడుతున్న పల్లెపాగు ప్రశాంత్

కొత్తకోట: ఐదేళ్లుగా మున్సిపాలిటీ పాలక మండలిలో అధికారం అనుభవించి, పట్టణాన్ని నాశనం చేసిన చైర్‌పర్సన్, బీఆర్ఎస్ కౌన్సిలర్ల గ్రహణం ఈ నెల 26తో ముగిసిందని మదనాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ అన్నారు. రాష్ట్రాన్ని సాధించుకున్న తర్వాత కొత్తకోటను మున్సిపాలిటీగా మార్చిన రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మి వారికి పట్టం కట్టారన్నారు. కానీ బీఆర్ఎస్ నాయకులు ఐదేళ్లుగా అవినీతికి పాల్పడుతూ మున్సిపాలిటీని మరో పదేళ్లు వెనక్కి నెట్టేశారని ఆయన విమర్శించారు. ఆదివారం బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఏర్పాటు చేసుకున్న వీడ్కోలు సమావేశంలో వారు అభివృద్ధి చేసిన పనుల గురించి ఏ ఒక్కటి మాట్లాడకపోవడం వారి పనితనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఎన్నికల వరకు రాజకీయాల్లో పోటీ ఉన్నప్పటికీ.. గెలిచిన తర్వాత అభివృద్ధిని గాలికి వదిలి వారి ఆస్తులను కాపాడుకోవడంలోనే కాలం గడిపారని ఆరోపించారు. పట్టణంలో రోడ్డు డివైడర్ పేరుతో రూ.లక్షల అవినీతి జరిగిందన్నారు. గ్రామాల్లో సైతం పాఠశాలలకు మంచి భవనాలు ఉంటే, కొత్తకోటలో మాత్రం బాలికలు చెట్ల కింద కూర్చొని చదువులు కొనసాగించడం దారుణమన్నారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కొత్తకోట పట్టణంలో అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో ప్రజలకు పరిచయం చేస్తామని హామీ ఇచ్చిరు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, చర్లపల్లి శేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బోయేజ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, జేఎం మిషేక్, సుభాష్, మాసన్న, రాములు, జబ్బార్ పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీహరి

వీపనగండ్ల: చాలీచాలని జీతాలతో పలు రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టం తక్షణమే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో ఏఐటీయూసీ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే రోజుల్లో కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సమిష్టి ఉద్యమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపకార్యదర్శి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు శ్రీరాం, మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్ నాయకులు దయాకర్, బాలీశ్వరమ్మ, లింగమ్మ, చెన్నమ్మ, రేణుక, వరలక్ష్మి, అనిల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీ నిలబెట్టుకుంది'



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారెంటీలో ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలు చేస్తోందని కాంగ్రెస్ పట్టణ నాయకుడు నందిమల్ల చంద్రమౌళి చెప్పారు. సోమవారం రైతు భరోసా పథకం ఎకరాకు రూ.12వేల చొప్పున ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేస్తున్న సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులతో కలిసి పాలాభిషేకం చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, రైతులకు కొన్ని దశాబ్దాలుగా విడదీయరాని అనుబంధం ఉందని.. ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమేనని చెప్పారు. గుట్టలు, రాళ్లు, రప్పలకు పెట్టుబడి సాయం ఇవ్వడం వృథా అని.. పక్కాగా వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులతో గ్రామాల్లో సర్వే చేయించి సాగు యోగ్యమైన భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

మానసిక సమస్యలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పుష్పలత

వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం లెక్చరర్లు, విద్యార్థులకు మానసిక సమస్యలు, భయం, ఆందోళన, కోపం, డిప్రెషన్ తదితర సమస్యల పరిష్కారం కోసం మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ పుష్పలత అవగాహన కల్పించారు. ఇందులో భాగంగానే స్టూడెంట్స్ అందరికీ స్క్రీనింగ్ అండ్ కౌన్సిలింగ్ ఇచ్చారు. టీచర్లు ఇంటర్ పర్సనల్ స్కిల్స్‌ను ఏ విధంగా పెంపొందించుకోవాలో అనే విషయాన్ని తెలియజేశారు. టెలి మానస్ యాప్ ద్వారా మానసిక సమస్యలను ఎలా పరిష్కరం చేసుకోగలమో సవివరంగా వివరించారు.

ముత్తిరెడ్డిపల్లి గ్రామస్తుల నిరాహార దీక్ష



రోడ్డు నిర్మాణం చేపట్టాలని దీక్ష చేస్తున్న గ్రామస్తులు

కోడేరు: మండలంలోని ముత్తిరెడ్డిపల్లిలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంలోని నాగులపల్లి, ముత్తిరెడ్డిపల్లి మీదుగా ఉన్న రహదారి నిర్మాణ పనులు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 1986లో అప్పటి ఎమ్మెల్యే హయాంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేశారని ఇప్పటి వరకు నూతన బీటీ రోడ్డు లేదన్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని పనులు చేపట్టకపోతే ఆందోళన చేపడుతామన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని డీఈ రమాదేవితో మాట్లాడారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో దీక్షను విరమించారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వలకు 25 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం మరో 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.